మున్నెం శారద

# కొంగున ముడివేసుకోనా...!

**అరవింద మనసులో నాటిన బీజం మొలకెత్తుతోంది ఆమెకు అకస్మాత్తుగా తల్లి మాటలు గుర్తొచ్చేయి!—జ్వరం వచ్చిన మనిషికి, తలనొప్పి, వాంతులు వచ్చినట్లే. తాగడం వ్యసనం వున్న వాడికి చుట్టూ, పేకాట, గుర్రప్పందాలు ఆడవోజు లాంటి ఇతర అలవాట్లు వచ్చి చేరుతాయి:**

అరవిందకి అమితమైన సంతోషంగా వుంది! తిరిగినచోటే తిరుగుతూ, చేసినపనేచేస్తూ కాలు గాలిన పిల్లిలా అటూయిటూ తిరుగుతోంది.

దానికి కారణం ఆ పొద్దుట పదకొండు గంటలకి నాగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కి వాళ్ళమ్మ సావిత్రమ్మ రావటమే

అరవిందకి పెళ్ళయి ఆర్నెల్లు కాలేదు!

అరవింద సావిత్రమ్మకి ఒక్కగానొక్క కూతురు! ఆ తర్వాత ఒక కొడుకు! సావిత్రమ్మ అరవిందని చాలా గారాబంగా పెంచుకొచ్చింది. ఏ పనీ చెప్పకుండా ముద్దుముద్దుగా చూసుకొచ్చింది.

కాలేజీలో చదువుకునే అరవింద ప్రాక్టికల్ రోజున రికార్డుబుక్ తీసుకెళ్తుంటేనే ఆ బరువుకి పిల్ల నలిగిపోతుందని రిక్షాలో వెళ్ళమనేది సావిత్రమ్మ. పరీక్షలప్పుడు రాత్రులు కాస్త ఎక్కువసేపు మెలకువగా వుండి చదువుతుంటే, కూతురి రంగు తగ్గిపోతుందని-అందం తరిగిపోతుందని హైరానపడిపోయేది సావిత్రమ్మ.

"అన్నిటికీ అలా హైరానపడిపోతే ఎలా? రేపు పెళ్ళయి అత్తారింటికెళ్తే అన్నీ చేసుకోవద్దూ" అని విసుక్కునేవాడు అరవింద తండ్రి అహోబలరావు.

"అత్తమామలున్న సంబంధం చేయించి దుమ్ము దులుపుతాననుకున్నారా పిల్లకి! వెనకా ముందూ ఎవరూ లేని వాడికి-పిల్లని పువ్వుల్లో పెట్టి చూసుకునే వాడికి యిస్తాను" అంది సావిత్రమ్మ ధీమాగా.

అహోబలరావు మరింక మాట్లాడలేదు

అసలాయన సావిత్రమ్మ ఎదుట ఎప్పుడూ తక్కువే మాట్లాడతాడు! పేరుకు మాత్రం ఆయన బలవంతుడయినా భార్య ముందు ఎప్పుడూ బలహీనుడే! బలహీనుణ్ణెప్పుడూ బలవంతుడు లొంగదీసుకుంటాడు!

సావిత్రమ్మ వస్తూవస్తూ అయిదెకరాల పొలంతో వచ్చింది. దాన్ని కేవలం తన సామర్థ్యంతో పదెకరాలు చేసింది ఈ విధంగా ఆర్థికబలంవున్న సావిత్రమ్మకి నోరు దేవుడిచ్చిన మరో గొప్పవరం!

ఈ రెండింటితో సావిత్రమ్మ అహోబలరావుని కదిలే పీనుగ చేసి కట్టిపడేసింది.

సంసార రాజ్యంలో ఒకరే రాజుండాలన్న సత్యమెరిగిన వాడయిన అహోబలరావు పవర్లన్నీ పెళ్ళానికొదిలి పక్కకి తప్పుకున్నాడు.

సావిత్రమ్మ అనుకొన్న విధంగానే వెదకి వెదకి రామకృష్ణని పట్టుకుంది. రామకృష్ణ ఎం. కాం. చదివేడు. బాంకులో మంచి వుద్యోగమే వెలగబెడుతున్నాడు అయిదడుగుల ఎనిమిదంగుళాల ఎత్తు. చామనఛాయ. బలిష్ఠమయిన శరీరం. వంకీల జుట్టు అందగాడిగానే చెప్పుకోవాలి

పైగా తల్లిదండ్రులకి అతను ఒక్కగానొక్క కొడుకు! పై లక్షణాలన్నిటితో పాటు-రామకృష్ణ మెదరితనం మరీమరీ ఆకర్షించింది సావిత్రమ్మని.

వెంటనే 'ఓ.కే' అనేసి పదిహేను రోజుల్లో పెళ్ళికూడా జరిపించేసింది సావిత్రమ్మ.

నోములని, వ్రతాలని వంకపెట్టి మూడు నెలలు కూతుర్ని కాపురానికే పంపలేదు సావిత్రమ్మ

అల్లుడెన్ని వుత్తరాలు రాసినా 'సింగినాదం!' అంటు చింపి పారేసింది. "అమ్మా. నేనింక వెళ్తానే!" అని కూతురు ఓరోజు నిలవేసేటప్పటికి. కాస్సేపు ముక్కుచీది. కళ్ళనీళ్ళెట్టుకుని-ఆవకాయ, అప్పడాలు అన్నీ సర్ది రైలెక్కించింది సావిత్రమ్మ కూతుర్ని

అరవింద వారానికో వుత్తరం రాస్తుంది తల్లికి.

ఆ వుత్తరాల సారాంశం అంతా ఒకటే! "తను క్షేమంగా వున్నానని-ఆయన చాలా మంచివారనీను" సావిత్రమ్మకి ఏమంత సంతృప్తిగా లేదు 'పిల్ల నిజమే రాస్తుందన్న గేరంటీ ఏమిటి?' అని ఏ మూలనో శంక!

దానికితోడు ఈ మధ్య ఒక్కసారిగా అరవింద దగ్గర్నుంచి లెటర్స్ రావటం ఆగిపోయేయి.

సావిత్రమ్మ తల్లిప్రాణం తల్లడిల్లిపోయింది. వెంటనే హైదరాబాదు బయల్దేరి కూతుర్ని చూస్తేగాని నిద్రపట్టేటట్లులేదు ఆమెకి 'పైకి మెత్తగా కన్పిస్తున్నాడు కాని పిల్లని పూరుకాని పూళ్ళో ఏమి రాచిరంపాన పెడుతున్నాడో' అని అనుకుంటేసరికి గుండె గుభేలుమంది.

గునపంలా గుండె ఒటవుతో నడిచే మనిషి, జబ్బునపడి మంచంమ్మీదనుంచి లేచినట్లు డీలా పడిపోయింది సావిత్రమ్మ.

అహోబలరావు ఎంత చెప్పినా వినకుండా ప్రయాణం కట్టింది.

కనీసం అల్లుడికో టెలిగ్రాం యిస్తానన్నా ససేమిరా వీల్లేదంది. అకస్మాత్తుగా వెళ్ళి అల్లుడి వ్యవహారం కనిపెట్టాలి" ఇదీ

సావిత్రమ్మ ఆలోచన. కూతురికి యిష్టం అని కజ్జికాయలు, కోవాపూత కొబ్బరిలౌజు తయారు చేసింది.

ఆటోవాడు అటుతిప్పి-యిటుతిప్పి చివరకు సావిత్రమ్మను యిల్లు చేర్చేడు. అరవింద ఆపాటికి పక్కింటి పరమేశ్వరితో పిచ్చాపాటి మాట్లాడుతుంది.

ఆటోలోంచి ఆయాసపడుతూ దిగుతున్న తల్లినిచూసి ఉలిక్కిపడి- అనక ఆనందంతో పరిగెత్తుకొచ్చి కావలించుకుంది.

అరవింద కాస్సేపు ఆనందంగా తల్లి వడిలో తల పెట్టుకు పడుకుంది.

రాత్రంతా ప్రయాణం చేసి అలసిపోయేవు. కాఫీ అయినా తాగేవో లేదో! బాత్రూమ్‌లో బాయిలర్‌లో వేణ్ణీళ్ళున్నాయి! స్నానం చేయి. నేను కాఫీ తెస్తాను" అంది లేచి.

సావిత్రమ్మ బట్టలు తీసుకుని బాత్రూమ్‌లోకి నడిచింది. "కూతురు సుఖంగానే వున్నట్లుంది! ముఖం కళకళ లాడుతూనే వుంది" అని కాస్త సంతృప్తిగా వూపిరి పీల్చుకుంది సావిత్రమ్మ.

కాఫీతాగుతూ "ఆ కారియర్‌లో కోవాపూత కొబ్బరి లౌజులున్నాయి తినవే తల్లీ" అంది ప్రేమగా కూతురితో.




"ఇదేవిటమ్మా! అకస్మాత్తుగా వచ్చేసావు టెలిగ్రాం యిస్తే స్టేషన్‌కి వచ్చేవాళ్ళం కాదూ" అంది.

"పడుకుంటే చాలు కళ్ళలో కన్పిస్తున్నావు! ఊరు గాని వూళ్ళో ఎలా వున్నావోనని ప్రాణం తల్లడిల్లిపోయిందే తల్లీ దానికి తోడు ఉత్తరాలు రాయటం కూడా మానుకున్నావు. ఉన్నపళంగా మీ నాన్న వద్దని చెప్పినా పరుగెత్తుకొచ్చేసేను" అంది కూతుర్ని ప్రేమగా నిమురుతూ.

అరవింద అపవాకులా హడావుడిగా కారియర్ తెరిచి తినలేదు. చిన్నగా నవ్వి" ఆయనకిష్టం అని గులాబ్‌జామ్ చేసేను. తెస్తానుండు" అంటూ లోపలికి వెళ్ళింది.

కూతురి చర్య తల్లికి కాస్త బాధ కల్గించింది.

అరవింద కప్పులో గులాబ్‌జామ్ పట్టుకొచ్చి "ఎలా చేసేనో రుచి చూడు" అంది.

సావిత్రమ్మ అందుకొని కాస్త నోట్లో వేసుకుంది. 'వంట బాగా నేర్చేవ్! అక్కడుండగా యిక్కడ పుల్ల అక్కడ పెట్టేదానివి కావు!" అంది మెచ్చుకోలుగా

"ఆ రోజులు వేరమ్మా. అలాగయితే యిప్పుడెక్కడ కుదురుతుంది!" అంది అర వింద [illegible]

"ఎందుకు కుదరదు! మీ యిద్దరి ప్రాణాలకి పొయ్యి దగ్గర కూర్చుని ఒకేపడి చెయ్యాలేమిటి? హోటల్ నించి తెప్పించుకుంటే పోలా!" అంది సావిత్రమ్మ.

"ఛీ! హోటల్ పదార్థాలు మంచివికావమ్మా. ఆయన కసలు యిష్టం వుండదు" అంది అరవింద.

సావిత్రమ్మ గొంతు చిట్లించింది

అరవింద వంట పనిలో పడింది.

తల్లికి తన వంట పని ప్రావీణ్యం చూపించాలనే తహ తహతో ఒకటే తింటాలు పడుతోంది అరవింద.

సావిత్రమ్మ యిల్లంతా సైప్ ఏజెంటులా కలయ దిరిగింది. 'ఇల్లు చిన్నదయినా ఎక్కడి వస్తువులక్కడ సర్ది అద్దంలా పెట్టుకుంది' కూతురు పనితనానికి ముచ్చట పడింది సావిత్రమ్మ.

మధ్యాహ్నం భోజనాల దగ్గర అల్లుడు సంగతులు ఆరాతీసింది సావిత్రమ్మ

"అల్లుడు భోజనానికి రాడూ!" అంది సావిత్రమ్మ.

"రాడమ్మా! పొద్దుటే భోంచేసి వెళ్తారు. మళ్ళీ సాయంత్రమే రావటం" అంది.

"ఏమైనా సినిమాలు చూసేరా."

"ఆదివారం ఆదివారం వెళ్తుంటాము" అంది అరవింద తల్లికి కూర వడ్డిస్తూ

"చీరలేమైనా కొన్నాదేవిటి?"

"కొంటానన్నారు కాని నేనే వద్దన్నాను. ఉన్న చీరలే కట్టుకోవటం లేదు!" అంది అరవింద నవ్వుతూ.

"కొంటానన్నప్పుడే కొనిపించుకోవాలి వెర్రిమొహమా! సంసారం పెరిగేకా కుదురుతుందా?" అంది సావిత్రమ్మ కూతురి తెలివి తక్కువ తనానికి బాధపడుతూ.

"అదేవిటమ్మా. ఆయనెవరోలా చెబుతావు! ఈ రోజుల్లో ప్రతిదీ డబ్బుపోసి కొనుక్కోవాలి! ఇంటద్దెలు హెచ్చు డబ్బు మంచినీళ్ళ మాదిరి ఖర్చయిపోతుంది. ఉన్నవాటినే మళ్ళీ కొనుక్కుంటుంటే చివరికి యిబ్బంది పడేది మేంకాదూ!" అంది అరవింద.

కూతురి పెద్దరికానికి ఆశ్చర్యపడింది సావిత్రమ్మ.

ఆ తర్వాత మాటలు సాగలేదు.

* * *

రాత్రి పదిగంటలవుతుండగా కాలింగ్ బెల్ మోగింది.

అరవింద పరిగెత్తుకుంటూ వెళ్ళి తలుపు తీసింది.

రామకృష్ణ లోపలి కొస్తూ వస్తూనే "సారీ డియర్! లేటయింది కదూ" అంటూ భార్య బుగ్గన చిటికెయ్యబోయి అవతల చెట్టంత అత్తగారు కన్పించటంతో ఆ పని విరమించుకున్నాడు

వినయంగా అత్తగారికి నమస్కరించి "ఎప్పుడొచ్చేరు." అన్నాడు పలుకరింపుగా.

సావిత్రమ్మ కొంగు భుజాల మీదుగా లాక్కుని "పొద్దుటే బాబూ" అంది.

"భోంచేసారా?" అన్నాకీ గదిలోకి వెళ్ళిపోతూ.



భయం

"మాఆయనకు నేనంటే ఎంతో ప్రేమ. ఒంటి నిండా నగలు చేయిందాడు" అంది రామలక్ష్మి, రాజ్యలక్ష్మితో.

"మాఆయనకీ నేనంటే ఎంతో ప్రేమ. అందుకే నగలు చేయించరు. నగలు పెట్టుకుంటే నన్ను ఎవరైనా ఎత్తుకు పోతారని భయం" అంది రాజ్యలక్ష్మి.

—ఎమ్. రాజ్యవల్లి (హైదరాబాదు)

"ఇంక లేదు" అంది సావిత్రమ్మ

అరవింద భర్తవెంట గదిలోకి వెళ్ళింది. సావిత్రమ్మ గదివేపు అనుమానంగా చూస్తోంది.

"అల్లుడి వాటం బాగోలేదు! మనిషి దగ్గర ఏదో వాసన. ఒక్కపిల్లని వదిలి రాత్రి పదకొండు గంటలకా రావటం!"

"అమ్మా నువ్వురా! మనం భోంచేద్దాం!" అంది అరవింద గదిలోంచి వచ్చి.

సావిత్రమ్మ ఆలోచనలోంచి బయట పడింది.

"అదేం! అల్లుడుగారు భోంచెయ్యరూ!" అంది. "లేదమ్మా! వాళ్ళాఫీసులో ఏదో పార్టీ జరిగిందట తినలేనన్నారు" అంది అరవింద.


సావిత్రమ్మ ఆలోచిస్తూ భోంచేస్తుంది. అరవింద తలెత్తి తల్లివేపు చూసి "అదేం అమ్మా. సరిగ్గా తినటంలేదు! కూర బాగోలేదా?" అంది.

సావిత్రమ్మ ఆ మాట విన్పించుకోలేదు. "అల్లుడుగారు ఏం చేస్తున్నారు?" అంది.

"పడుకున్నారు

"అయినా రాత్రి పదిగంటలకి పార్టీలేవిటే ఇన్ని పకోడీలు బొక్కి టీ నీళ్ళు తాగితే ఆకలి పోతుందా? అన్నం తినాలి కాని" అంది.

అరవిందకి ఏం చెప్పాలో తోచలేదు. "పార్టీ అంటే పకోడీలే వుండవు! ఏదో బిరియానీ అవీయివీ తింటారులే!" అంది మాట మార్చాలని.





**బాబూ ధర్మం**

"బాబూ! కళ్ళులేని కబోదిని. ధర్మం చేయండి" అన్నాడు బిచ్చగాడు.

"చాల్లే పోవయ్యా! కళ్ళు మా దగ్గ రెక్కడుంటాయి!" విసుగ్గా అన్నాడు విజయకుమార్.

—ఆర్. డేవిడ్ విల్సన్ (కావలి)

సావిత్రమ్మ క్షణం మాట్లాడలేదు

ఆ తర్వాత "నువ్వో పిచ్చి మొద్దువి!" అంది

తల్లి మాటలకి ఆశ్చర్య పడింది అరవింద.

"అదేమిటమ్మా?" అంది అమాయకంగా.

"అల్లుడిగారి దగ్గర వాసనొస్తోంది. అదయినా గ్రహించేవా?" అంది సావిత్రమ్మ.

అరవింద మాట్లాడలేనట్లు చూసింది.

"తాయారమ్మ అల్లుడేం చేసేడు! పట్నం సంబంధం అని బోల్డు కట్నం యిచ్చి చేస్తే ఫస్టుక్లాసయిన మాగాణీ అంతా అమ్మి తాగి తగలేసి పోసుకున్నాడు. చీట్లపేకాడి పెళ్ళాం మెడలో పుస్తె ముక్కలుకూడా అమ్ముకున్నాడు గుర్రపందేలకెళ్ళి గుడిసె కూడా లేకుండా చేసుకున్నాడు. చివరకా సుశీల గతి ఏమయ్యింది. పరువుగా బతికిన పిల్ల గిన్నెలు తోముకొని బతుకుతోంది" అంది.

"అయితే?" అంది అరవింద అర్థం కానట్లు.

"అయితే అని అడుగుతావేమే పిచ్చి సన్నాసి! అల్లుడు తాగొచ్చేడు! ఆ సంగతి నీకూ తెలుసు" అంది సావిత్రమ్మ ఉచ్చితంగా.

అరవింద తలదించుకుంది "అది ఓరమ్మా అదేం చెయ్యదు! ఇక్కడ అందరూ తాగుతారు ఇది పెద్ద తప్పేం కాదు!" అంది.

సావిత్రమ్మ కూతురివేపు నివ్వెరపోయినట్లు చూసింది.

"మనవాళ్ళో బుడ్డమ్మ కొట్లో తాగితే ఆ సారా అంటాం. ఇక్కడ పెద్ద పెద్ద హోటళ్లో రంగురంగు సీసాల్లో తాగితే అది వీస్కో, బ్రాందో అని గొప్పగా చెప్పుకుంటాం. కాని అదీ యిదీ చివరికి చేసేపని ఒక్కటే! ఒళ్లు గుల్లచేసి కొంపలార్పటం!" అంది సావిత్రమ్మ కూతురివేపు నిరసనగా చూస్తూ.

"ఆయనెప్పుడూ తాగరమ్మా! ఎప్పుడో యిలా పార్టీలు జరిగినప్పుడే!" అంది అరవింద తల్లి అపార్థం చేసుకుంటుందని గ్రహించింది.

"మొదట ఎవరైనా అంతేనే తల్లీ! అప్పుడప్పుడంటూనే ఎప్పట్లోకి దిగి చిప్ప చేతికి తెచ్చుకుంటారు"

"ఆయనలాంటి వారు కాదమ్మా!" అంది అరవింద.

సావిత్రమ్మ హేళనగా నవ్వింది "అర్నెల్లు కాపురం చేసిందో లేదో ఆయనగారి సంగతంతా చెప్పేస్తోంది. మొదట ఎవడయినా పెళ్ళాం అంటే మహా ప్రేమ నటిస్తాడు. అదంతా కొత్త మోజు! నాలుగేళ్ళు నడిచి నలుగురు పిల్లలు పుట్టనీ! రంగు బయట పడుతుంది అప్పుడు చెప్పు నీ మొగుడి గొప్ప!" అంది.

అరవిందకేం జవాబు చెప్పాలో తెలియటం లేదు! మొగుణ్ణి చెడ్డగా ఊహించటానికి చేతకావటం లేదు. అతని కళ్ళల్లో అబద్ధపు నీడలు ఆమెకు గోచరించలేదు! అతని మాటల్లో మోసపు ఛాయ ఆమె చూడలేదు కాని.... తల్లి మాటలు బొత్తిగా తీసెయ్యనూ లేదు! అనుమానం పంకించుకొన్న ఆమె అనుమానాల్ని పూర్తిగా కొట్టిపారెయ్యలేదు.

అరవింద ఆలోచన సావిత్రమ్మకని పెట్టింది.

వంగినప్పుడే చెట్టుని వరకాలన్న సిద్ధాంతం ఆమెది.

"నీకు తెలియదే పిచ్చితల్లి. తెల్లనివన్నీ పాలనుకుంటావు. మగవాళ్ళ రంగు తెలుసుకోవాలంటే వాళ్ళ తెలివితేటలు కావాలి. వాళ్ళు పెళ్ళాంమీద చూపించే ప్రేమలో మూడొంతులు నటనే వుంటుంది. వాళ్ళంతా అవకాశవాదులు మహా కన్నింగ్ లేరు! వాళ్ళు చెప్పిందానికల్లా తల తాటించకూడదు. జేబులో చిల్లర పైసలన్నా ఎక్కువ వుంచకూడదు ఆఫీసు టైముదాటితే ఆరా తియ్యాలి పెళ్ళాం అంటే పోలీసాఫీసర్లా వుండాలి. మొగుణ్ణెప్పుడు కేడీగాడిలానే చూడాలి. ఇదంతా మొదట్నుంచీ రావాలి. నుంచి మెత్తగా వున్నామంటే మూడుకాళ్ళ మీద ఆడతాడు మగాడు. లేదంటే మచ్చిక చేసిన పిల్లే" అంది సావిత్రమ్మ అహోబిలగావుని తలచుకుంటూ గర్వంగా.

అరవింద మాట్లాడలేదు.

సావిత్రమ్మ కదిలించనూ లేదు.

• • •

సావిత్రమ్మ ఊరెళ్ళి మూడు రోజులవుతోంది. అత్తగారున్నన్ని రోజులు భార్యతో సరిగ్గా మాట్లాడటానికే కుదరలేదు రామకృష్ణకి.

ఆ రోజు బాంకు నించి వస్తూనే "సినిమా టిక్కెట్లు తెచ్చేను. త్వరగా రెడీ అవ్వు" అని తొందరపెట్టేడు అరవిందని.

అరవింద తయారయ్యింది.

వీళ్ళు వెళ్ళేసరికి పిక్చర్ స్టార్టయింది.

గేట్ కీపర్ చూపించిన ప్రకారం వాళ్ళ సీట్లలోకి వెళ్ళి కూర్చున్నారు. రిలీజింగ్ డే! హాలంతా రష్‌గా వుంది.

"హల్లో! మీరా!" అని పలుకరించింది



రామకృష్ణ పక్క ఆడగొంతు. రామక్రిష్ణ పక్కకి తిరిగి చూసేడు అతనితోపాటు అరవింద కూడా తిరిగి చూసింది.

సులోచన! ఆమె రామక్రిష్ణ దాంకలోనే పనిచేస్తోంది. రామకృష్ణ "అరె! సులోచేరా" అంటూ సులోచనని అరవిందకి పరిచయం చేసేడు.

అరవింద ముభావంగా నమస్కారం పెట్టింది

సినిమా పొడవునా సులోచన ఏవో కామెంటు చేస్తూనే నవ్వుతుంది. రామకృష్ణ వంత పాడుతున్నాడు.

ఇంటర్వెల్‌లో రామకృష్ణ బయటకివెళ్ళేడు. సులోచన అతని ఛెయిర్‌లోకి వచ్చి చనువుగా మాట్లాడసాగింది. "రామకృష్ణగార్ని కొట్టేసిన దొంగ మీరన్న మాట! చాల లక్కీ ఫెలో మీరు! రామకృష్ణగారు చాల మంచి మనిషి."

అరవింద మనసులో నాటిన బీజం మొలకెత్తుతోంది ఆమెకు అకస్మాత్తుగా తల్లి మాటలు గుర్తొచ్చేయి!

'జ్వరం వచ్చిన మనిషికి తలనొప్పి, వాంతులు వచ్చినట్లే, తాగుడు వ్యసనం వున్న వాడి చుట్టూ, పేకాట, గుర్రప్పందాలు, ఆడ మోజు లాంటి యితర అలవాట్లు కూడా వచ్చి చేరుతాయి'

అరవిందకు తల్లి మాటలు నిజమనిపించింది

'సులోచనకి రామకృష్ణకి ఏదో సంబంధం వుండి వుండాలి! అందుకే ఆమెను కూడ సినిమాకి రమ్మని వుంటాడు! లేకపోతే తమ పక్కనే సీటెలా వస్తుంది?' ఆమె మిగతా సినిమా చూడలేక పోయింది.

సినిమానుండి యింటికి తిరిగొచ్చేవరకూ ముభావంగానే వుంది అరవింద.

"అలాగున్నావేం?" అన్నాడు రామకృష్ణ యింటికి రాగానే భార్యని దగ్గరికి తీసుకుంటూ.

అరవింద అతని చేతులు విసిరి కొట్టింది.

ఆమె కళ్ళలో నీళ్ళు చూసి రామకృష్ణ విస్తుపోయేడు. కాపురాని కొచ్చేక మొదటిసారి భార్య కళ్ళలో నీళ్ళు!

"ఏం జరిగింది?" ఆత్రుతగా అడిగేడు.

"ఏం జరగాలి?" కాలు దువ్వి రంకేసిన కోడెదూడలా అడిగింది అరవింద బుసలు కొడుతూ.

రామకృష్ణకి అర్థం కాలేదు.

"ఆ వగలాడిని సినిమాకి తీసుకొచ్చినప్పుడు మధ్యలో నన్నెందుకు తీసుకెళ్ళాలి? మీ సరసాలు చూసి ఏడ్వాలనా? మీలాంటివారిను కోలేను! అది ఎలా మాట్లాడింది! నేను మిమ్మల్ని కొట్టేసేనట దాన్నే కిట్టుకుని పూరేగ మనలేక పోయేరూ" అంటూ రాగాలు తీసింది

రామకృష్ణ మ్రాన్పడి చూసేడు.

అతనికి అకస్మాత్తుగా తన భార్య రూపు మారిపోయినట్లు కనిపించింది. జుట్టు విరబోసుకుని, కోరలు మొలిచిన క్షుద్రదేవతలా వుందని పించింది.

ఆ రోజు రాత్రి రామకృష్ణ పాలిట శివరాత్రయింది.

పెళ్ళానికి నచ్చ చెబుతూ వస్తతో జాగారం చేసేడు. అయితే ఆ రాత్రి నుంచి తన జీవితం మారిపోబోతుందనేసంగతి తర్వాతకాని తెలియలేదు రామకృష్ణకి.

తల్లి పాఠాలు వంటబట్టించుకున్న అరవింద తు చ తప్పకుండా పాటించటం మొదలెట్టింది.

బీర్ తాగినా బేర్‌బేర్ మని ఏడుస్తోంది!

ఆఫీసునుండి బస్సందక ఆలస్యం అయినా అల్లరిచేసి అన్నం వండటం మానేస్తోంది.

సి. ఐ. డీ. ఏజెంటులా జేబులు వెతుకుతోంది!

రామకృష్ణకి ప్రాణసంకటం అయిపోతుంది! ఓ నవ్వులేదు! ఓ సరదా లేదు!

ఎప్పుడు అనుమానంగా తనని శల్యపరీక్షగా చూసే భార్యని చూస్తే అతని ప్రాణం విసిగి పోతోంది.

ఓ దొంగ, పోలీసు కలసి కాపురం చేస్తున్నట్లు వుస్తోంది అతనికి. 'అరవిందని ఎలా మార్చాలి! అసలెందుకిలా తయారయ్యింది?' అతనికి అంతు బట్టటం లేదు

అయితే...అకస్మాత్తుగా అరవింద బదులు రామకృష్ణే మారిపోయేడు! మంచినీళ్ళు తప్ప మరేమీ ముట్టటం లేదు! "కాఫీ తాగండి, తప్పులేదు" అంది అరవింద అనునయంగా.

"వద్దులే అరూ! కాఫీ కూడ తాగుడు లాంటిదే! అది మాత్రం ఎందుకు తాగాలి?" అన్నాడు.

భర్తలోని మార్పుకి ఆశ్చర్యపోయింది అరవింద.

దారికి వస్తున్నందుకు సంతోషపడింది.

తల్లి సలహా పని చేసినందుకు ఆనందపడింది. ఆఫీసు-ఇల్లు తప్ప మరో లోకం లేదు అతనికి.

భార్యని తప్ప మరో ఆడదాన్ని చూడ్డం




ప్రేమ

"ప్రేమలేఖ అన్నావు ఒక్క అక్షరం కూడా లేదేమిటి?" తెల్లకాగితంచూసి ఆశ్చర్యంగా అన్నాడు ప్రేమారావు, రామారావుతో.

"మాది మూగప్రేమలే..." అన్నాడు రామారావు.

—ఆర్. డేవిడ్ విల్సన్ (కావలి)



లేదు ! పక్కింటి బామ్మగారొచ్చినా, ఎదురింటి అయిదేళ్ళ పాప 'అంకుల్' అని పిలిచినా తల ఎత్తడం లేదు !

వాళ్ళకి కూడా అలా భయపడ్డం దేనికని అరవింద అడిగితే "పోనిద్దూ ! ఆడవాళ్ళతో నాకేవిటి ?" అని వెళ్ళిపోతాడు.

భర్తలోని మార్పుని తల్లికి చెప్పి, తల్లి నుంచి సర్టిఫికెట్టు పొందాలని మహా సరదాగా వుంది అరవిందకి.

సరిగ్గా అప్పుడే పండక్కి రమ్మని ఆహ్వానం అందింది

రామకృష్ణ రానన్నా మొదటిపండగని మొరాయించి లాక్కెళ్ళింది అరవింద.

రామకృష్ణ అత్తగారికి మామగారికి పాదాభివందనం చేసేడు అత్తగారు కాఫీ యివ్వబోతే వద్దంటూ భార్యవేపు చూసేడు రామకృష్ణ.

"ఆయన కాఫీమానేసేరు" అంది అరవింద గర్వంగా కళ్ళు తిప్పుతూ. సావిత్రమ్మ ఆశ్చర్యపోయింది.

కాలక్షేపానికి "కాస్సేపు పేకాడదాం రా బాబూ అల్లుడూ !" అన్నాడు అహోబలరావు.

"పేక నేను ముట్టుకోనండీ ! నాకు ఎలర్జీ" అన్నాడు రామకృష్ణ తలదించుకొని.

సావిత్రమ్మ వింతగా కూతురివేపుచూసింది.

అరవింద అతిశయంగా నవ్వింది.

రామకృష్ణ భార్యవేపు అమాయికంగా చూసేడు.

• • •

భోజనం ముగించి హాల్లో కూర్చున్నాడు రామకృష్ణ.

పక్కగదిలో సావిత్రమ్మ గొంతు సన్నగా వినిపిస్తోంది. "అల్లుడు చాలమారినట్లున్నాడే ?"

"ఏమనుకున్నావ్ మరి నా తడాఖా అంటే ?" అది అరవింద కంఠం

"ఏం చేసేవేమిటి" సావిత్రమ్మ కుతూహలం.

"ఏముంది. నీవు నేర్పిన విద్యే ! కదిలితే కన్నీళ్ళు కార్చేను ! కాదంటే గొంతు పెంచేను ! దెబ్బకి లొంగి పోయేరనుకో."

సావిత్రమ్మ కూతురి తెలివి తేటలకి నవ్వింది

"ఇప్పుడింటి పట్టునే వుంటున్నాడా !"

"ఆఁ ఏదో ఈ మధ్య సీటుమారి కాస్త కేంపులు వెళ్ళినపుడు తప్ప ! ఎక్కడికెళ్తే ఏముందిలే ! కాఫీయే తాగని మనిషితో !" అంది అరవింద.

హాల్లో రామకృష్ణ నవ్వేడు !

అరవింద ఉలిక్కిపడి లేచింది.

"ఏమయ్యిందండీ !" అంది పరిగెత్తుకొచ్చి.

"ఏం లేదు ! ఏదో జోక్ !" అంటూ పత్రిక చూపించేడు. అతనింకా నవ్వుతూనే వున్నాడు

మనసులోంచి తన్నుకొస్తున్న నవ్వు ఆగనంటోంది !

"అతి అన్నివిధాల అనర్థం" అన్నారు మైడియర్ అరవిందా ! విజాయితీగా వున్న నన్ను నిలబెట్టి ప్రాణాలు తీసేవ్ ! నా స్నేహితుడి సహాయంమీద నేను హాయిగా బ్రతగ్గలుగుతున్నాను. నిజానికి నాకే కేంపులూ లేవు ! కేంపు రోజున పూళ్ళో స్టార్ హోటల్లో పేకాట ! పోకాలు లాగించి సరదాలు తీర్చుకుంటున్నానని తెలిస్తే నువ్వేమవుతావ్ మైడియర్ వైఫ్ !" అని ప్రశ్నిస్తోంది అతని మనసు.

అతని మనసు తెలియని అరవింద "పదండి" మన గదిలోకి వెళ్దాం అంది.

తెల్ల వేరు సోకిన పాములా అతను లేచి అరవిందని అనుసరించేడు. గుమ్మంలో నిలబడి తమనే గమనిస్తున్న తల్లిని చూసి కొంగు నడుంకి బిగించి జడముందు కేసుకుని వయ్యారంగా ముందుకి నడిచింది అరవింద. ✱

